ప్రజాపక్షం

జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

గురువారం | 22 అక్టోబరు , 2026 | పేజీలు : 3


## చెడుపై మంచి సాధించిన విజయమే దసరా వేడుక



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** చెడుపై మంచి సాధించిన విజయమే దసరా పడుగ ఇతివృత్తమని మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు అన్నారు.దసరా దుర్గా శరన్నవ రాత్రుల్లో బాగంగా దశమి మంగళవారం విజయదశమి పండగ సందర్భంగా ఆయన తన పాలకవర్గంతో కార్యలయం వద్ద శమి పూజలు చేసి శుభాకాంక్షలు తెలుపు న్నారు. పట్టణ ,మండల వ్యాప్తంగా నరకాసుర వధ కార్యక్రమాన్ని ఘనంగా జరుకున్నారు. ముఖ్యంగా పట్టణ కేంద్రంలోని దుర్గా కమిటీ ,అయ్యప్ప స్వామి ఆలయంలో, మహమ్మాయి దేవాలయంలో,మద్దేలమ్మ ఆలయాలలో దసరా ఉత్సవాలు కనులపండువగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కొయ్యడ రజిని శ్రీనివాస్ గౌడ్ చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ కౌన్సిలర్స్ కో ఆప్షన్ మెంబర్స్,శ్రీరంజన్ యూనిట్ అధినేత ఎన్నం శివకుమార్ కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షుడు వంగూరి పాండు పాల్గొన్నారు.కాగా బుధవారం దుర్గాదేవి నిమజ్జన కార్యక్రమం కోలాహలంగా నిర్వహించారు.

# పోలీస్ అమరవీరుల త్యాగం..
# జాతికి స్ఫూర్తిదాయకం

### ఘనంగా పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం

### ప్రజల రక్షణలో ప్రాణత్యాగం.. పోలీస్ అమరులకు ఘన నివాళి: కలెక్టర్ చంద్రశేఖర్,ఎస్పి శరత్ చంద్ర పవార్





**ప్రజాపక్షం/నల్లగొండ:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని అక్టోబర్ 21న నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ ఐఏఎస్, జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ తో పాటు పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు, అధికారులు అమరుల సేవలను స్మరించుకున్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న సేవలు ఎంతో కీలకమని అన్నారు.శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు అనేక సవాళ్లను ఎదుర్కొంటూ నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల ధైర్యం,కర్తవ్యనిష్ఠ, అంకితభావం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు. నేరాల నియంత్రణ,మహిళలు,బాలల భద్రత, రోడ్డు ప్రమాదాల నివారణ,సైబర్ నేరాలపై అవగాహన, మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు.అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుని యువత దేశభక్తి, క్రమశిక్షణ, సేవాభావాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ మాట్లాడుతూ పోలీసు విధి కేవలం ఉద్యోగం మాత్రమే కాదని, ప్రజల పట్ల బాధ్యత, దేశం పట్ల నిబద్ధతతో కూడిన పవిత్రమైన కర్తవ్యమని అన్నారు.నల్లగొండ జిల్లాలో విధి నిర్వహణలో ఇప్పటివరకు 15 మంది పోలీస్ అధికారులు,సిబ్బంది అమరులయ్యారని వెల్లడించారు.దేశవ్యాప్తంగా ఈ ఏడాది విధి నిర్వహణలో 154 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రాణత్యాగం చేశారని తెలిపారు. ప్రజల రక్షణ,శాంతిభద్రతల పరిరక్షణ కోసం అమరులైన పోలీసుల త్యాగాలు చిరస్మరణీయమని, వారి సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి రమేష్, డీఎస్పి కె. శివరాం రెడ్డి, ఏఆర్ డీఎస్పి శ్రీనివాస్,సీఐలు,ఆర్ఐలు,ఎస్ఐలు,ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది,పోలీస్ అమరవీరుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలి

### సూర్యాపేట జిల్లా ఎస్పి నరసింహ



**ప్రజాపక్షం/సూర్యాపేట:** ప్రజల ప్రాణాలకు,ఆస్తులకు రక్షణ కల్పిస్తూ విధి నిర్వహణలో అమరులైన పోలీసు వీరుల త్యాగాలు చిరస్మరణీయమని జిల్లా ఎస్పి కె.నరసింహ అన్నారు.పోలీసు అమరవీరుల సంస్మరణ దినం,ఫ్లాగ్ డే సందర్భంగా బుధవారం జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు.దేశ వ్యాప్తంగా విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన 154 మంది అమరవీరుల పేర్లను అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి చదివి వినిపించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ అమరవీరుల సంస్మరణ దినం కేవలం వారిని స్మరించుకునే రోజు మాత్రమే కాదని,వారి త్యాగాల నుంచి స్ఫూర్తి పొంది ప్రజలకు మరింత నిబద్ధతతో సేవ చేయాలని ప్రతిజ్ఞ చేసే రోజని అన్నారు.సూర్యాపేట గడ్డపై అమరులైన పోలీసులను ఆయన గుర్తు చేసుకున్నారు. తిరుమలగిరి పోలీస్ స్టేషన్‌పై నక్సల్స్ దాడిలో హెడ్ కానిస్టేబుల్ బడే సాహెబ్,సూర్యాపేట హైటెక్ బస్టాండ్ వద్ద 2015 ఏప్రిల్ 2న ఉగ్రవాదుల దాడిలో కానిస్టేబుల్ ఎం.లింగయ్య, హోంగార్డు కె.మహేష్,నాగారం పీఎస్ పరిధిలో వాహన తనిఖీల్లో కానిస్టేబుల్ శీలం కమలాకర్ ప్రాణత్యాగం చేశారని తెలిపారు.అమరవీరుల కుటుంబాలకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,వారి సంక్షేమాన్ని పరిరక్షించడం తమ బాధ్యత అని అన్నా రు. రిజర్వ్ ఇన్స్పెక్టర్ జానయ్య పరేడ్ కమాండర్‌గా వ్యవహరించగా, ఆర్మ్‌డ్ డీఎస్పి నరసింహాచారి కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ రవీందర్ రెడ్డి, డీఎస్పి లు ప్రసన్న కుమార్,శ్రీనివాస్ రెడ్డి,నరసింహాచారి,ఇన్స్పెక్టర్లు, ఆర్ఐలు,ఎస్ఐలు,పోలీసు సంఘం నాయకులు రమేష్,కిరణ్,అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## ఆధ్యాత్మిక వైభవంతో విజయదశమి వేడుకలు

### ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** దసరా విజయదశమి వేడుకల సందర్భంగా నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో, విజయాలతో వర్ధిల్లాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం స్థానిక ఎన్ఎస్పి క్యాంపు గ్రౌండ్లో నిర్వహించిన దసరా ఉత్సవాల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులతో కలిసి జమ్మి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సమీపంలో ఏర్పాటు చేసిన రావణ దహన కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, మున్సిపల్ చైర్మన్ చిలుకూరి సుధా బాలకృష్ణ, ప్రముఖులు అల్లుబెల్లి అమరేందర్‌రెడ్డి, సాదినేని శ్రీనివాసరావు, నల్లమోతు సిద్ధార్థ, గాయం ఉపేందర్‌రెడ్డి, డబ్బికర్ మల్లేష్, ముదిరెడ్డి నర్సిరెడ్డి, శాగ జలెందర్‌రెడ్డి, దేశిడి శేఖర్‌రెడ్డి, గోదాల జానకి రామ్ రెడ్డి, మిట్టపల్లి వెంకటేష్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

## సిఎంతో కలిసి విజయదశమి వేడుకల్లో డిసిసి అధ్యక్షుడు



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** నాగర్ కర్నూల్ జిల్లా కొండారెడ్డిపల్లిలో తెలంగాణ ముఖ్యమంత్రితో కలిసి జరిగిన విజయదశమి వేడుకల్లో నల్లగొండ జిల్లా డీసీసీ అధ్యక్షుడు పున్న కైలాష్ నేత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసి దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం హెలిప్యాడ్ నుండి ప్రత్యేక ప్రచారరథంపై ముఖ్యమంత్రితో కలిసి కొండారెడ్డిపల్లిలోని ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయాన్ని దర్శించుకున్నారు.

## ఘనంగా అమ్మవారి శోభాయాత్ర

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మండలంలోని యాద్గార్‌పల్లిలో గ్రామంలో శ్రీ కనకదుర్గ అమ్మవారి శోభాయాత్ర అత్యంత వైభవంగా జరిగింది. బుధవారం గ్రామంలో అమ్మవారి శోభాయాత్రను పురస్కరించుకుని ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణకర్త బంటు వెంకటేశ్వర్లు, రమేష్, చంద్రమౌళి, సతీష్, నవీన్, నాగేంద్ర శర్మ, రామకృష్ణ, మాధవ్, దుండిగాల శివ, మణి, దేవి వరప్రసాద్, బంటు రేణుక, శైలజ, ఎల్లమ్మ, సుజాత, వెంకటమ్మ పాల్గొన్నారు.





## మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** ప్రజా సంక్షేమం, అభివృద్ధి కోసం శ్రమిస్తున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిజమైన ప్రజానాయకుడని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు చలసాని శ్రీనివాసరావు కొనియాడారు. నేరేడుచర్ల మండలం కల్లూరు గ్రామ నుండి సోమవారం వరకు రెండుకిలోమీటర్ల బిటి రోడ్డు నిర్మాణానికి రూ. 2.20 కోట్ల భారీ నిధులను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. బుధవారం కల్లూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బుడిగె వెంకటేశ్వర్లు గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ ఉప్పెల్లి మహేష్, వార్డు మెంబర్ కొడాలి పట్టయ్య, చలసాని మాధవరావు, కొడాలి భాస్కర్ రావు, యార్లగడ్డ వెంకటేశ్వరరావుపాల్గొన్నారు.

## బీటీరోడ్ల మంజూరుతో గ్రామస్తుల హర్షం





**ప్రజాపక్షం/నడిగూడెం:** మండలంలోని వల్లాపురం, సిరిపురం గ్రామ పంచాయతీల పరిధిలో వల్లాపురం నుండి శ్రీరంగాపురం వరకు సిరిపురం నుండి శ్రీరంగాపురం గ్రామాలకు బిటిరోడ్డు మంజూరు చేసినందుకు భారీనీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి లకు మండల పార్టీ అధ్యక్షులు మొక్క బిక్షపతి ఆధ్వర్యంలో వల్లాపురం సర్పంచ్ కేసగాని సరితలక్ష్మ ణ్, సిరిపురం పాలక వర్గం, కార్యకర్తలు గ్రామ ప్రజలు పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్‌లు, వార్డు సభ్యులు, మాజీ ఎంపిటిసిలు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## లక్కీ డ్రా విజేత కోటా చారి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** మండల కేంద్రంలోని దేవరకొండ రోడ్డులోని శ్రీఆంజనేయస్వామి దుర్గా మాత దేవాలయంలో దేవీ నవరాత్రులలో భాగంగా నిర్వహించిన లక్కీ డ్రాలో మండల కేంద్రానికి చెందిన ఆందోజు కోటా చారి లడ్డు ప్రసాదంతో పాటు 5 గ్రాముల బంగారాన్ని దక్కించుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన గడ్డిఅన్నారం మాజీ మార్కెట్ చైర్మన్ కందాల నిర్విన్‌రెడ్డి అమ్మవారి కలశంతో పాటు 5 తులాల వెండిని లక్కీ డ్రాలో గెలుచుకున్నాడు. సర్పంచ్ పసునూరు యుగేందర్‌రెడ్డి, కొడిదాల వెంకటయ్యలు ఈ లక్కీ డ్రా కూపన్‌లను ప్రశాంతమైన వాతావరణంలో భక్తుల సమక్షంలో తీశారు. అమ్మవారి ఊరేగింపును ప్రశాంతగా నిర్వహించుకోవాలని సర్పంచ్ యుగేందర్‌రెడ్డి అన్నారు.



# ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం ఖాయం



**ప్రజాపక్షం/నడిగూడెం:** రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయ కేతనం ఎగురవేయడం ఖాయమని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ఏనుగుల రాకేష్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో చేపట్టిన నిరసన దీక్షలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగులకు మోసం చేస్తోందని ఆరోపించారు. ఉద్యోగ నియమకాలు చేపట్టకుండా కాలయాపన చేస్తూ నిరుద్యోగ యువతను ఇబ్బందులకు గురి చేస్తోందని విమర్శిం చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మాటలకే పరిమితమైందని విమర్శ. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రాకేష్‌రెడ్డి విమర్శించారు. నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరి స్తోందని ఆరోపించారు. రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభు త్వానికి తగిన బుద్ధి చెప్పాలని పట్టభద్రులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, నాయకులు అనంతుల ఆంజనేయులు, బోనగిరి ఉపేందర్, శ్రీనివాసరెడ్డి, ప్రవీణ్, మేకల గంగరాజు, జలీల్, పొలంపల్లి వెంకటేశ్వర్లు, ఎలగొండ నాగేశ్వరరావు, ఉపేందర్, రఫీ నాయకులు పాల్గొన్నారు.

# డిఎస్‌పి, ఎస్ఐలకు ఘన సన్మానం



**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని అనంతగిరి గ్రామంలో ఇటీవల ప్రకటించిన గ్రూప్ 1 ఫలితాలలో సిరిసిల్ల డిఎస్‌పిగా ఎంపికైన సట్టు భవాని, ఉప్పల్ ఎస్ఐగా ఎంపికైన సట్టు వినయ్ లను గ్రామ సర్పంచ్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నందిగామ శ్రీనివాసులు వారికి షీల్డ్‌లను బహుకరించారు. గ్రామానికి చెందిన విద్యావేత్త కోదాడ డిస్టెన్స్ అకాడమి కోఆర్డినేటర్ గద్దె రాంబాబు ప్రముఖులకు సంభందించిన పుస్తకాలను బహుకరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుండి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో పట్టుదలతో చదువుకుని పోటీ పరీక్షల్లో విజయం సాధించి ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించారని నిరుపేద కుటుంబానికి చెందిన సట్టు అచ్చయ్య సీతమ్మ ఎంతో కష్టపడి వారి పిల్లలను చదివించారని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ బుర్రా వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు గద్దె రఘు, గుండ్లపల్లి వెంకన్న, కొల్లు సుబ్బారావు, చుండూరు మురళి, దాములూరి మురళి, బుర్రా నాగమల్లేశ్వరావు, బుర్ర వీరబాబు, నేరెళ్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

# పండుగ సాయన్న జయంతి నిర్వహణ అభినందనీయం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** తెలంగాణ పోరాట యోధుడు పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడం ఎంతో హర్షనీయమని బీసీ జేఏసీ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. బుధవారం పట్టణంలోని మహాత్మా జ్యోతిరావు పూలే భవనంలో బీసీ జేఏసీ ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి కార్యక్రమం, ప్రచార గోడపత్రిక ఆవిష్కరణ సభ నిర్వహించారు. బీసీ జేఏసీ మిర్యాలగూడ నియోజకవర్గ కో కన్వీనర్లు దాసరాజు జయరాజు, చేగొండి మురళీ యాదవ్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జరిగింది. సమావేశానికి అతిథిగా 21వ వార్డు కౌన్సిలర్ వెలుగు ఇందిర నాగరాజు హాజరై గోడపత్రికను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా మాట్లాడిన ప్రతినిధులు పేదలు, బహుజనుల హక్కుల కోసం, అణచివేతకు వ్యతిరేకంగా పోరాడిన వీరుడు పండుగ సాయన్న అని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు నాగరాజు, పున్న రాములు, కంచి సత్యనారాయణ, పిల్లలమర్రి రవి కుమార్, బోయపాటి రవీందర్‌గౌడ్, దువ్వ చంద్ర శేఖర్, నల్లబోతు నవీన్ యాదవ్, తిరుపతయ్య, పూర్ణచందర్, శ్రీధర్, ఇతర ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు మిర్యాలగూడలో దళిత క్రైస్తవ అవగాహన సదస్సు




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యునైటెడ్ దళిత క్రిస్టియన్ ఫదరేషన్ (యుడిసిఎఫ్) ఆధ్వర్యంలో నేడు మిర్యాలగూడలోని విజయ గార్డెన్స్ లో జరిగే దళిత క్రైస్తవ అవగాహన సదస్సును క్రైస్తవులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని యుడిసిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెద్దమాము డేవిడ్ రాజ్ పిలుపునిచ్చారు.బుధవారం నల్లగొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్రైస్తవులపై దాడులు పెరిగిపోతున్నాయని,దళితుల పట్ల వివక్ష చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రైస్తవ పాస్టర్లపై భౌతిక దాడులు,చర్చిల్లోకి చొరబడి దాడులు చేస్తున్న ఘటనలు పెరుగుతున్నాయన్నారు.క్రైస్తవులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అండగా నిలిచే వారు లేకుండా పోయారని, ఐక్యత లేకపోవడం వల్లే క్రైస్తవ సమాజం ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు.ప్రేమ,సేవతో సమాజంలోకి వచ్చిన క్రైస్తవానికి ఒకప్పుడు ఎంతో మంచి పేరు ఉండేదని,స్వార్థం,ఐక్యత లేమి వల్ల ఆ పేరు దెబ్బతింటోందన్నారు.ఈ అంశాలతో పాటు దళిత క్రైస్తవులకు ఎస్‌సి హోదా కల్పించాలనే దృఢ సంకల్పంతో ఈ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ సదస్సుకు ప్రొఫసర్ ఖాసీం,మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వర రావు, విశారదన్ మహరాజ్, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్,రావెల కిషోర్ బాబు,రాజీవ్ సాగర్,నతాని యేలు తదితరులు హాజరవుతారని తెలిపారు.



## ఎం.ఎ. రహీంకు ఘన సన్మానం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండల కేంద్రంలోని వాసరవి గార్డెన్‌లో బుధవారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది, హైకోర్టు అడ్వకేట్ ఎంఎ. రహీం ఇటీవల రెడ్ క్రాస్ డైరెక్టర్‌గా ఎన్నికైన సందర్భంగా ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈసందర్భంగా మాజీ జిల్లా కో ఆప్షన్ సభ్యులు ఖలీల్ మాట్లాడుతూ మారుమూల గ్రామం నుండి అంచెలంచెలుగా ఎదిగి ఉన్నత స్థానానికి చేరుకున్నారని, పట్టుదల ఉంటే దేన్నైన సాధించవచ్చని దీనికి నిదర్శనం ఎంఎ రహీం అని ఆయనను కొనియాడారు. ఎంఎ. రహీం మాట్లాడుతూ లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్ ద్వారా ఈ ప్రాంతాలకు అనేక సేవలందిస్తున్నామన్నారు. ఈకార్యక్రమంలో బాల్‌రెడ్డి ప్రెస్ క్లబ్ అధ్యక్షులు దశరథ, టియూడబ్ల్యూజే జిల్లా నాయకులు ప్రభాకర్ రెడ్డి, సురేందర్, ప్రజా పక్షం విలేకరి పులి నర్సయ్య,రాజు, మోహన్, మహేష్,దశరథ, స్వామి, మహేందర్, హరికృష్ణ, ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం




**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ప్లాస్టిక్ సంచుల వాడకాన్ని పూర్తిగా అరికట్టి ప్రతి ఒక్కరూ బట్టల సంచులను వినియోగించాలని లైన్స్ క్లబ్ ప్రతినిధులు కోరారు. బుధవారం స్థానిక లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగా బట్టల సంచుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లైన్స్ క్లబ్ జెడ్ సి క్యామ వెంకటేశం మాట్లాడుతూ నిత్య జీవితంలో ప్లాస్టిక్ వాడకం విపరీతంగా పెరిగిపోవడం వల్ల పర్యావరణానికి తీవ్ర విఘాతం కలగడమే కాకుండా ప్రజలు అనేక రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.నిర్లక్ష్యం వహిస్తే ఆసుపత్రుల పాలై ఆరోగ్యం కోసం రూ.1 లక్ష వరకు ఖర్చు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు అనుముల సైదిరెడ్డి, సెక్రటరీ ఎన్. నరసింహారెడ్డి, డి సి బి. కిరణ్ కుమార్, నేతి వెంకటేశ్వర్లు, క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అమరవీరుల త్యాగాలు వెలకట్టలేనివి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సమాజంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తూ, ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పించే క్రమంలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగం వెలకట్టలేనిదని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కొనియాడారు. బుధవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భద్రత కోసం నిరంతరం విధులు నిర్వహిస్తూ, రాత్రింబవళ్లు శ్రమిస్తున్న పోలీసుల సేవలు ఎంతో అభినందనీయమని తెలిపారు. విధి నిర్వహణలో ప్రాణాలను త్యాగం చేసిన పోలీసు అమరవీరుల వీరగాథలు సమాజానికి, రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తాయని పేర్కొన్నారు.

## కార్మికులకు దుస్తుల పంపిణీ

**ప్రజాపక్షం/హాలియా:** హాలియా మున్సిపాలిటీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ మున్సిపల్ చైర్మన్ సతీమణి చింతల దీప్తి బుధవారం ఉచితంగా దుస్తులను పంపిణీ చేశారు.దసరా పండుగను



పురస్కరించుకుని హాలియాలోని మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మున్సిపాలిటీలో పనిచేస్తున్న సుమారు 80 మంది పారిశుధ్య కార్మికులకు,సిబ్బందికి ఆమె తన సొంత ఖర్చులతో చీరలు, దుస్తులను అందజేశారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి మాట్లాడుతూ హాలియా పట్టణ పరిశుభ్రత కోసం అహర్నిశలు శ్రమిస్తున్న మున్సిపల్ కార్మికుల సేవలు వెలకట్టలేనివని అన్నారు.



## వికలాంగులకు ఉపాధి హామీ పనుల కేటాయింపు

**ప్రజాపక్షం/కోదాడ రూరల్:** గుడిబండ గ్రామంలో మంగళవారం వీవీజీ రామ్‌జీ పథకంలో భాగంగా వికలాంగులకు ఉపాధి హామీ పనులు కేటాయించారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మందుల నాగయ్య వికలాంగులు చేస్తున్న పనులను పరిశీలించి,వారికి ఎదురవుతున్న ఇబ్బందులు,సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ పథకం ద్వారా వికలాంగులకు ఉపాధి లభించడంతో పాటు ఆర్థికంగా తోడ్పాటు అందుతుందని ఆయన తెలిపారు.ప్రతి ఒక్కరూ ఈ పథకంలో భాగస్వాములై ఉపాధి పనుల్లో పాల్గొనాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్ భిక్షం తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే వీరేశం పరామర్శ



**ప్రజాపక్షం/నకిరేకల్** : స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డుకు చెందిన కంచెనపల్లి ఉత్తరచారి, 18వ వార్డుకు చెందిన కొప్పు లింగమ్మ అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్,స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం వారి మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించి,ఆర్థిక సాయం అందించారు. వారి వెంట పిఎసిఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు లింగాల వెంకన్న నాయకులు కొండ వెంకన్న గౌడ్ మట్టిపల్లి ట్టిపల్లి వీరు,యాసరపు వెంకన్న,సిద్దోజుబిక్షమాచారి తదితరులు ఉన్నారు.

## వార్డు సభ్యుల సమస్యలు గుర్తించాలి

**ప్రజాపక్షం/నకిరేకల్** : వార్డు సభ్యుల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కృషి చేయాలని రాష్ట్ర వార్డు మెంబర్ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ గానగాని రమేష్ గౌడ్ అన్నారు.మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో నకిరేకల్ నియోజకవర్గ వార్డు మెంబర్ల ఫోరం ఇన్‌ఛార్జిగా కట్టంగూరు మండలం పందెనపల్లి గ్రామానికి చెందిన కావటి శైలజ యాదగిరిని నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు.తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఫోరం వ్యవస్థాపకులు నాగబెల్లి జ్యోతి మహేష్,రాష్ట్ర కోఆర్డినేటర్ పోగుల నాగార్జునరెడ్డి, రాష్ట్ర లీగల్ సెల్ ఇన్‌ఛార్జి అందె రవికుమార్‌లకు శైలజ కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో వార్డు సభ్యులు కానుగు శ్రీను గౌడ్,ఏనుగు సైదులు గౌడ్,కోలా రాంబాబు, వీరేశం, చేరుకు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ బడి నుంచి వైద్య కళాశాలకు



**ప్రజాపక్షం/నకిరేకల్**:పేదరికాన్ని అధిగమించి పట్టుదలతో చదివి నీట్ ద్వారా ఎంబీబీఎస్ సీటు సాధించిన కట్టంగూరు చెందిన విద్యార్థిని వీరమళ్ల హనుమాన్‌మంజుల దంపతుల ప్రథమ పుత్రిక తేజశ్రీ పలువురికి స్ఫూర్తిగా నిలిచింది. ఇటీవల విడుదలైన నీట్ ఫలితాల్లో అర్హత సాధించి ప్రభుత్వ కోటాలో మహబూబ్‌నగర్ జిల్లాలోని వైద్య కళాశాలలో సీటు పొందింది. కట్టంగూరు మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న ఆమె విజయం కుటుంబంతో పాటు ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది.తేజశ్రీ విజయంపై హర్షం వ్యక్తం చేసిన ఆమె తండ్రి చిన్ననాటి స్నేహితులు పూలమాలలు,శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. పేదరికం ఉన్నత లక్ష్యాలకు అడ్డుకాదని, పట్టుదలతో కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సైతం వైద్య విద్యలో సీట్లు సాధించవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్తులో మంచి వైద్యురాలిగా ఎదిగి పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బొడ్డుపల్లి రమేష్, అంతటి నాగేష్, సూరేష్, శ్రీనివాస్,పోగుల యాదగిరి,కొంపల్లి నాగరాజు,నర్సింగు వెంకన్న,చెరుకు శ్రీనివాస్,శ్రవణ్, మాతంగి శంకర్ పాల్గొన్నారు.

## ఘనంగా అమ్మవారి శోభాయాత్ర



**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** దేవిశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నేరేడుచర్ల పట్టణంలోని విజయ దుర్గ ఆలయంతో పాటు శివాజీ నగర్, నర్సయ్య గూడెం, ఆటోనగర్, రామాపురం, కట్లగడ్డలో తొమ్మిదిరోజుల పాటు విశేష పూజలు అందుకున్న అమ్మవారి ఉత్సవ విగ్రహన్ని భక్తిశ్రద్దలతో శోభయాత్రగా తీసుకెళ్లారు.



**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలోని ఎర్రగండ్లపల్లి గ్రామంలోని శ్రీ కోట మైసమ్మ దేవాలయ ప్రాంగణంలో నిర్వహించిన శ్రీ కోట దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి.నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రాందాస్ శ్రీనివాస్,పులిమామిడి నరసింహారెడ్డి,కృష్ణారెడ్డి,లింగం, రమేష్,చంద్రశేఖర్,వెంకటేష్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/నేరేడుగొమ్ము;** నల్గొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ గ్రామంలో కొలువైన తుల్జా భవాని అమ్మవారిని దేవరకొండ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు వడ్త్య రమేష్‌నాయక్ దర్శించుకొని ఇచ్చిన మాట ప్రకారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రెండు తులాల బంగారాన్ని సమర్పించి మొక్కును చెల్లించుకున్నారు. ఈకార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ అధ్యక్షులు లోకసాని తిరుపతన్న, పెద్దమునిగల్ మాజీ సర్పంచ్ అంజయ్య, అంకాలు, రాములు, ఆలయ పూజారి భకత్ జీవన్, జగన్, బాలు పాల్గొన్నారు.



ప్రజాపక్షం/త్రిపురారం: మండల కేంద్రంలో దుర్గామాత అమ్మవారి శోభాయాత్ర బుధవారం ఘనంగా నిర్వహించారు.మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం,మున్నూరు కాపు సంఘం,విద్యానగర్ కాలనీ,రాజీవ్ కాలనీ,రామాలయం యూత్ ఆధ్వర్యంలో ఈ శోభాయాత్రను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అనుముల శ్రీనివాసరెడ్డి, ఉప సర్పంచ్ అనుముల నాగమణి పాపిరెడ్డి,మంచికంటి సుధాకర్,రామ కోటయ్య,గౌరీ వెంకటేశ్వర్లు,ఆదినారాయణ,నరేష్, యాదగిరి,నగిరి వెంకన్న,నగిరి శ్రీనివాస్, పులిజాల విష్ణుకుమార్,కసిరెడ్డి నరేష్,మేడారపు సత్యనారాయణ,జంగిలి శ్రీనివాస్ పాల్గొన్నారు.



**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** విజయదశమి సందర్భంగా ఇష్టకామేశ్వరి సమేత శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దివ్యక్షేత్రంలో జమ్మిచెట్టు కింద శనిపూజ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. గ్రామ పురోహితులు మృత్యుంజయ శాస్త్రి, ఆలయ అర్చకులు విష్ణువర్ధన్ శర్మ, ధనుంజయశర్మలు వేదమంత్రాల మద్య పూజలు శాస్త్రోతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి నాగేల్ల శంభిరెడ్డి, సర్పంచ్ బచ్చు పద్మావతి శ్రీనివాస రెడ్డి, ఉత్సవ కమిటి చైర్మన్ పెండ్లీ లచ్చయ్య, ముఖ్య నాయకులు కాకునూరి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** విజయానికి ప్రతీకగా భావించే విజయదశమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం నేరేడుచర్ల పట్టణంలోని విజయ దుర్గ ఆలయంలో, విద్యానగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శమీ పూజను భక్తిశ్రద్దలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, గ్రామపెద్దలు, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు.





## పోలీస్ అమరవీరుల దినోత్సవం

**ప్రజాపక్షం/దేవరకొండ;** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్‌విటి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, లీగల్ అడ్వైజర్ ఉమా మహేష్, జ్యోతి, వెంకన్న, జయలక్ష్మి, సాయి, సీనయ్య, శివ, ఆకాష్, సన్నీ, శ్రీకాంత్, సబీర్, స్నేహాల్, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.

### ఘనంగా పోలీస్ అమరవీరులకు నివాళి



**ప్రజాపక్షం/నిడమనూరు:** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా నిడమనూరు పోలీస్ స్టేషన్‌లో పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా నిడమనూరుకు చెందిన పోలీస్ అమరవీరుడు ఉన్నం చెన్నకేశవులు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.విధి నిర్వహణలో అమరులైన పోలీస్ అమరవీరుల త్యాగాలను స్మరించుకున్నారు.శాంతి భద్రతల పరిరక్షణలో వారి సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఎస్ఐ డి.విజయ్ కుమార్,పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## పిఆర్‌టియు టిఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా ఎగ్గడి శ్రీనివాస్ నియామకం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** పీఆర్‌టియూ టీఎస్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా మండల పరిధిలోని పొట్లపహాడ్ గ్రామానికి చెందిన ఉపాధ్యాయ నాయకుడు ఎగ్గడి శ్రీనివాస్ నియమితులయ్యారు. ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పీఆర్‌టియూ టీఎస్ రాష్ట్ర కౌన్సిల్ మహాసభల్లో ఈ మేరకు ఆయన నియామకాన్ని అధికారికంగా ప్రకటించారు. ఎగ్గడి శ్రీనివాస్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ఎమ్మెల్సీశ్రీపాల్ రెడ్డి, పీఆర్‌టియూ టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సుంకరి బిక్షంగౌడ్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.మధుసూదన్ రెడ్డిలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.ఉపాధ్యాయుల హక్కుల సాధన కోసం,సంఘ బలోపేతానికి తన శాయశక్తులా కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.శ్రీనివాస్ నియామకం పట్ల స్థానిక ఉపాధ్యాయులు,మండల విద్యాశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## శివన్నగూడెం ప్రాజెక్టు పరిశీలన

**ప్రజాపక్షం/మర్రిగూడ:** డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మిస్తున్న శివన్నగూడెం ప్రాజెక్టును బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఏరుకొండ అబ్బయ్య పరిశీలించారు.ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల మధ్య జల విభేదాలు సృష్టిస్తూ ప్రాజెక్టు పనులను అడ్డుకునేందుకు ప్రయత్నిస్తున్న శక్తులకు హెచ్చరికలు జారీ చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఫ్లోరైడ్ సమస్యతో తీవ్రంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న నల్లగొండ జిల్లా, ముఖ్యంగా మునుగోడు ప్రాంత ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో కేసీఆర్ శివన్నగూడెం ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి పనులను దాదాపు పూర్తయ్యే దశకు తీసుకొచ్చారని పేర్కొన్నారు.ప్రస్తుతం జిల్లాల మధ్య వివాదాలు సృష్టిస్తూ ప్రాజెక్టును నిలిపివేయాలని ప్రయత్నించడం సరికాదని స్పష్టం చేశారు. పగిళ్ల శంకర్, నర్సింహా,మాడ్గుల సాయి,బొల్లోజు శంకర్ పాల్గొన్నారు.

